క్లుప్తంగా

నాగిరెడ్డిపేట ఆయుర్వేద డాక్టర్‌గా దీప



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): నాగిరెడ్డిపేట ఆయుర్వేద డాక్టర్‌గా దీప శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈ మేరకు నాగిరెడ్డిపేట ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఆమె బాధ్యతలు తీసుకున్నారు. చాలాకాలంగా నాగిరెడ్డిపేట మండలంలో ఆయుర్వేద డాక్టర్ అందుబాటులో లేకపోవడం వల్ల మండలప్రజలు ఆయుర్వేద వైద్యసేవలకు దూరమయ్యారు. ఎట్టకేలకు నియమించడంతో హర్షం వ్యక్తం చేశారు.

బీర్కూర్ తహసీల్దార్‌గా భుజంగరావు

బాన్సువాడ : బీర్కూర్ తహసీల్దార్‌గా సాయి భుజంగరావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన లత డిప్యుటేషన్‌పై ఎల్లారెడ్డికి వెళ్లగా ఎల్లారెడ్డి ఆర్డీవో కార్యాలయంలో డీటీగా పని చేసిన సాయి భుజంగరావు బీర్కూర్‌కు డిప్యుటేషన్‌పై వచ్చారు. భుజంగరావుకు సిబ్బంది స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజలకు మెరుగైన సేవలందిస్తానని ఆయన అన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో శుక్రవారం సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను బాధితులకు పంపిణీ చేశారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సంగారెడ్డి, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు లింగాగౌడ్, మాజీ వైస్ ఎంపీపీలు శ్రీనివాస్ రెడ్డి, రూపేందర్ రెడ్డి, అడ్లూర్ ఎల్లారెడ్డి విండో చైర్మన్ సదాశివరెడ్డి, యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శ్యాంబాబు, పట్టణ అధ్యక్షుడు రాజయ్య, నాయకులు వెల్డింగ్ సుధాకర్ రెడ్డి, రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

వాల్ పోస్టర్ల ఆవిష్కరణ



ఎల్లారెడ్డిరూరల్: వెంకటాపూర్‌లో భవన నిర్మాణ కార్మికుల వాల్ పోస్టర్లను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ నెల 28న సిద్దిపేటలో నిర్వహించే బహిరంగసభకు కార్మికులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు. సాయిబాబా, బాల్‌రాజ్ తదితరులున్నారు.

బేస్‌మెంట్ పూర్తి కాగానే రూ.లక్ష జమ



బాన్సువాడ రూరల్: ఇందిరమ్మ ఇంటి నిర్మాణంలో భాగంగా బేస్‌మెంట్ వరకు నిర్మాణం పూర్తి కాగానే ప్రభుత్వం లబ్ధిదారుడి అకౌంట్‌లో రూ.లక్ష జమ చేస్తుందని బాన్సువాడ ఎంపీడీవో ఆనంద్ అన్నారు. శుక్రవారం ఆయన కోనాపూర్, హన్మాజీపేట్ తదితర గ్రామాల్లో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల పురోగతిని పరిశీలించారు. ఇంకా పనులు ప్రారంభించని వారు వెంటనే ప్రారంభించాలని కోరారు. డీఎల్‌పీవో సత్యనారాయణరెడ్డి ఉన్నారు.

మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలి



తాడ్వాయి (ఎల్లారెడ్డి): విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలని మండల ప్రత్యేక అధికారి శివకుమార్ అన్నారు. తాడ్వాయి బాలికల గురుకుల పాఠశాలను శుక్రవారం ఎంపీడీవో సాజిద్‌అలీతో కలిసి తనిఖీ చేశారు. తాజాగా ఉండే కూరగాయలతో పాటు నాణ్యమైన ఆహారాన్ని అందించాలన్నారు. వంటగదిని ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని సూచించారు. పాఠశాల ఆవరణలో చెత్తాచెదారము, పిచ్చి మొక్కలను తొలగించాలన్నారు. ప్రిన్సిపాల్ సురేఖ తదితరులు ఉన్నారు.

బోధనపై ఎంఈవోకు ఫిర్యాదు



భిక్కనూరు: మండలంలోని ప్రైవేట్ పాఠశాలల్లో విద్యా బోధన సరిగా జరగడం లేదని భిక్కనూరు ఎంఈవో రాజగంగారెడ్డికి టీజీవీపీ ఆధ్వర్యంలో శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. ప్రైవేట్ పాఠశాలల్లో ఉపాధ్యాయులు సరిగా లేరని విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలను కల్పించడం లేదని పేర్కొన్నారు. వెంటనే ప్రైవేట్ పాఠశాలలను తనిఖీ చేసి నిబంధనలు పాటించని వాటిపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు. టీజీవీపీ నేతలు కార్తీక్, భాను, తదితరులు పాల్గొన్నారు.

ఊరుస్తున్న తరగతి గదులు

- 9 తరగతులు, 7 గదులు
- స్లాబు కూలుతుందేమోనని భయపడుతున్న విద్యార్థులు
- బరంగెడ్గి పాఠశాల దుస్థితి

బాన్సువాడ : బీర్కూర్ మండలం బరంగెడ్గి ఉన్నత పాఠశాలలో తరగతి గది ఊరుస్తోంది. పాఠశాలలో ఉన్న తరగతి గదులు శిథిలావస్థకు చేరడంతో ఏ క్షణాన కూలుతాయోనని విద్యార్థులు భయాందోళన చెందుతున్నారు. బరంగెడ్గి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1వ తరగతి నుంచి 9వ తరగతి వరకు విద్యా బోధన కొనసాగుతోంది. పాఠశాలలో 86 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. 8 మంది ఉపాధ్యాయులున్నారు. ఇంగ్లీషు, ఫిజికల్ సైన్స్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 9 తరగతులకు గాను 7 గదులు మాత్రమే ఉన్నాయి. ఏడు గదుల్లో నాలుగు గదులు శిథిలావస్థకు చేరి వర్షం నీరు స్లాబ్ లోంచి తరగతి గదుల్లోకి వస్తున్నాయి. అసలే గదుల కొరత ఉండడంతో వర్షకాలంలో విద్యార్థులకు ఒక్కో గదిలో మూడు, నాలుగు తరగతుల నిర్వహణ కొనసాగుతోంది. ఐదేళ్ల క్రితం నూతనంగా నిర్మించిన తరగతి గదులు నాసిరకంగా నిర్మించడంతో పెచ్చులూడుతున్నాయి. తరగతి గదుల కొరతపై పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని విద్యార్థులు పేర్కొంటున్నారు. ప్రమాదం జరగకముందే అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



బరంగెడ్గి పాఠశాలలో తరగతి గది స్లాబ్ నుంచి వస్తున్న వర్షపు నీరు

ఎమ్మెల్యేపై ఫిర్యాదు



దేవునిపల్లి ఎస్సైకి ఫిర్యాదు చేస్తున్న పీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి

కామారెడ్డి టౌన్: సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వాఖ్యలు చేసిన హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం చంద్రశేఖర్‌రెడ్డి శుక్రవారం దేవునిపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేయాలని ఎస్సై భువనేశ్వర్‌ను కోరారు.



పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న నేతలు

నాయకులు పంపరి శ్రీనివాస్, జూలూరి సుధాకర్ తదితరులున్నారు.

పట్టణ పోలీస్‌స్టేషన్‌లో..

కామారెడ్డి టౌన్: ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ జిల్లా లీగల్ సెల్ చైర్మన్ దేవరాజ్‌గౌడ్, నాయకులు పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అసత్యపు ప్రచారం చేస్తూ శాంతి భద్రతలకు విఘాతం కల్పిస్తున్న ఎమ్మెల్యేపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోనె శ్రీనివాస్, సీనియర్ న్యాయవాదులు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీకాంత్‌గౌడ్, శ్రావణ్‌గౌడ్, కిరణ్, రాజశేఖర్ తదితరులున్నారు.

పాఠశాలకు 20 ఎకరాల భూమి అప్పగింత



మద్నూర్(జుక్కల్): మండల కేంద్రానికి మంజూరైన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కోసం 20 ఎకరాల ప్రభుత్వ భూమి పత్రాలను శుక్రవారం రెవెన్యూ అధికారులు, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి టీజీఈడబ్ల్యూఐడీసీ డిప్యూటీ ఈఈ(కామారెడ్డి)కి అందించారు. మండల కేంద్రంలోని ఎల్లమ్మ గుట్ట సమీపంలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేయడంతో సర్వేనంబర్-499లో 20 ఎకరాలు కేటాయించామని తహసీల్దార్ ముజీబ్ చెప్పారు. కాంగ్రెస్ నేత దరాస్ సాయిలు, సలాబత్‌పూర్ ఆలయ కమిటీ చైర్మన్ రాంపటేల్, తదితరులున్నారు.

ఏ వీధిలో చూసినా చెత్త కుప్పలే



విద్యానగర్ రోటరీ పార్క్ వద్ద పడేసిన చెత్త

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి పట్టణంలోని పలు వీధుల్లో చెత్తకుప్పల దర్శనం సర్వ సాధారణమైన విషయం అయిపోయింది. వార్డు కౌన్సిలర్లు ఉన్న సమయంలో ప్రతిరోజు ఇంటింటికి చెత్తబండి వస్తే ఇప్పుడు కౌన్సిల్‌లో అడిగే నాథుడు లేకపోవడంతో చెత్తబండ్ల రాక ఇష్టా రాజ్యంగా మారిపోయింది. సగం చెత్తబండ్లు చెడిపోవడం, పారిశుద్ధ్య సిబ్బంది ఎవరో ఒకరు చనిపోవడం, జీతాలు సరిగా రాకపోవడం, వాహనం టైరు పంక్చర్ అయిందని ఇలా రకరకాల కారణాలతో ఒక్కోసారి మూడు రోజులకు ఒక సారి చెత్తబండి రావడంతో ఇంట్లో సౌకర్యం లేని వారు కోతుల బాధకు వీధుల్లో తీసుకువచ్చి పారేస్తున్నారు. దీంతో ఏ వీధిలో చూసిన చెత్తకుప్పలు దర్శనం ఇస్తున్నాయి. అలాగే మురికి కాల్వల నుంచి తీసిన మట్టిని సైతం అలాగే వదిలేస్తుండడంతో మళ్లీ కాలువల్లో జారిపోయి ఫలితం లేకుండా ఉందని అంటున్నారు.



శ్రావణి ఐటీఐ కళాశాల సమీపంలో..

సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

లింగంపేట(ఎల్లారెడ్డి): సీజనల్ వాధులు రాకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని మండల వైద్యాధికారి రాంబాయి సూచించారు. శుక్రవారం ఆమె.. సిబ్బందితో కలిసి లింగంపేట మండలంలోని మాలోత్ తండాలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి తండా వాసులకు వ్యాధులపై అవగాహన కల్పించారు. జ్వరాలతో బాధపడుతున్న వారికి, ఇతర సమస్యలు ఉన్న వారికి పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. అలాగే ఇంటింటికి తిరిగి లార్వా, జ్వర సర్వే నిర్వహించినట్లు తెలిపారు. నీరు నిల్వ ఉన్న డ్రమ్ములు, కుళాయిల నుంచి నీటిని తొలగించారు. దోమల నివారణకు మందులు పిచికారీ చేయించినట్లు తెలిపారు. ఎంపీవో మలహరి, సీహెచ్‌వో ఠాగూర్, గోవింద్‌రెడ్డి, కార్యదర్శి రాజ్యలక్ష్మి, రమేశ్, ఫరీదా, యాదగిరి, రాధిక, నౌషీన్, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాల సందర్శన



పిట్లం(జుక్కల్): విద్యార్థులు కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించి కళాశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని జిల్లా ఇంటర్ నోడల్ అధికారి షేక్ సలాం విద్యార్థులకు సూచించారు. ఆయన శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించారు. కళాశాల నూతన ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టిన విజయ్ శేఖర్‌ను అభినందించారు. అనంతరం అధ్యాపకులతో సమావేశం ఏర్పాటు చేసి సూచనలు చేశారు. సలహాలు ఇచ్చారు.

నూతన వధూవరులకు అభినందన



ఎల్లారెడ్డిలో నూతన వధూవరులతో కేటీఆర్

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డిలో బీఆర్‌ఎస్ నాయకుడి కుమారుడు, కోడలిని మాజీ మంత్రి కేటీఆర్ శుక్రవారం ఆశీర్వదించారు. ఎల్లారెడ్డి పట్టణంలోని బీఆర్‌ఎస్ నాయకులు కమ్రుద్దీన్, జుబేర్‌ల కుమారుడు ఖదీర్ దంపతులను మాజీ మంత్రి కేటీఆర్ దీవించారు. నూతన జంట కేటీఆర్‌కు ఆయన కుటుంబ సభ్యుల మెమోంటోను అందించారు. మాజీ ఎమ్మెల్యేలు జాజాల సురేందర్, బాజిరెడ్డి గోవర్ధన్, గంప గోవర్ధన్, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు ముజీబొద్దీన్, నాయకులు సతీష్, జలంధర్‌రెడ్డి తదితరులున్నారు.

కృష్ణాజీవాడిలో కేటీఆర్‌కు ఘన స్వాగతం

తాడ్వాయి(ఎల్లారెడ్డి): లింగంపేట్ మండల కేంద్రంలో తలపెట్టిన బీఆర్‌ఎస్ ఆత్మగౌరవసభలో పాల్గొనడానికి కామారెడ్డి నుంచి తాడ్వాయి మండల కేంద్రం మీదుగా వెళ్తున్న కేటీఆర్‌కు కృష్ణాజీవాడిలో బీఆర్‌ఎస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. నేతలు గోపాల్‌రావు, రాంరెడ్డి, కపిల్‌రెడ్డి, నర్సిములు, సాయిరెడ్డి, రాజిరెడ్డి తదితరులున్నారు.

కేటీఆర్ సభకు తరలిన బీఆర్‌ఎస్ నాయకులు

ఎల్లారెడ్డి: బీఆర్‌ఎస్ సభకు శుక్రవారం ఎల్లారెడ్డి నుంచి నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. నాయకులు జలంధర్‌రెడ్డి, సతీష్, రాము, అరవింద్, నర్సింలు, సురేందర్ తదితరులున్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

దోమకొండ: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. బీబీపేట పీహెచ్‌సీ వైద్యాధికారి శిరిష గ్రామ పంచాయితీ సిబ్బందికి, ఆరోగ్య సిబ్బందికి అవగాహన కల్పించి అనంతరం అవగాహన ప్రతులను ఆవిష్కరించారు. డెంగీ, చికెన్‌గున్యా, మలేరియా, తదితర వ్యాధులపై గ్రామ పంచాయతీ సిబ్బందికి వివరించారు. అదేవిధంగా గ్రామంలో దోమలు రాకుండా దోమల నివారణ మందు కొట్టాలని సిబ్బందికి సూచించారు. జిల్లా మలేరియా నివారణ అధికారులు శ్రీను వైట్ల, గంగాధర్ రావు, సీహెచ్‌వో ప్రమీల, సూపర్‌వైజర్ ప్రభావతి, తదితరులు పాల్గొన్నారు.



అవగాహన ప్రతులను ఆవిష్కరిస్తున్న వైద్య సిబ్బంది

చలో కామారెడ్డి జయప్రదం చేయాలి



నస్రుల్లాబాద్: మత్స్యకార కార్మిక సంఘం చలో కామారెడ్డి సభను జయప్రదం చేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి రఘుపతి మధుసూదన్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో మత్స్యకారుల సమావేశం ఏర్పాటు చేసి కరపత్రాలను ఆవిష్కరించారు. దీనిలో భాగంగా నస్రుల్లాబాద్ మండల కమిటీని నియమించారు. నస్రుల్లాబాద్ మండల అధ్యక్షుడిగా ఎర్ర సాయిలు, మండల ప్రధాన కార్యదర్శులుగా గుండె నెమ్లి గంగాబోయిని నియమించారు. ఈ నెల 28న కలెక్టరేట్ ఆఫీసు ముట్టడికి ప్రతి మత్స్య కార్మికుడు స్వచ్ఛందంగా రావాలన్నారు. మత్స్య కార్మికులు విఠల్, బి.రవీందర్, జి.పోశయ్య, టి.అంజయ్య, శిబోయి, నర్సబోయి తదితరుల పాల్గొన్నారు.

నూతన రేషన్ కార్డుల పంపిణీ

సాక్షి నెట్‌వర్క్ : ప్రభుత్వం కొత్తగా మంజూరు చేసిన రేషన్ కార్డులను ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి శుక్రవారం పంపిణీ చేశారు. భిక్కనూరు మండలం కాచాపూర్‌లో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, ఎల్లారెడ్డి మండలం జంగమాయిపల్లిలో ఏఎంసీ చైర్‌పర్సన్ రజిత, రాజంపేట మండలం ఆర్గొండలో ఎంపీడీవో రామకృష్ణ, తాడ్వాయిలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్ రెడ్డి, మద్నూర్ మండలం చిన్నశక్కర్గాలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దరాస్ సాయిలు, లింగంపేటలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బుర్ర నారాగౌడ్ తదితరులు కార్డులను లబ్ధిదారులకు అందజేశారు.



కాచాపూర్‌లో రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రకాంత్‌రెడ్డి



జంగమాయిపల్లిలో.. ఏఎంసీ చైర్‌పర్సన్ రజిత



ఆర్గొండలో..ఎంపీడీవో రామకృష్ణ

విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయాలి

లింగంపేట(ఎల్లారెడ్డి): విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈవో షౌకత్‌అలీ సూచించారు. శుక్రవారం ఆయన మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల, శెట్పల్లి ఉన్నత పాఠశాలలో ప్రాథమిక స్థాయి కాంప్లెక్స్ సమావేశాల్లో మాట్లాడారు. పాఠశాలల్లోని గ్రంథాలయాల ద్వారా చదవడం అలవాటు అవుతుందన్నారు. ప్రతీ విద్యార్థికి చదవడం, రాయడం నేర్పాలని సూచించారు.పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు కోటేశ్వర్‌రావు, వసుధ, వహీద్‌సిద్దీఖీ, సీఆర్పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



లింగంపేటలో మాట్లాడుతున్న ఎంఈవో షౌకత్‌అలీ

లైబ్రరీ వినియోగంపై దృష్టి పెట్టాలి



మాచారెడ్డి: పాఠశాలల్లో గ్రంథాలయ వినియోగంపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి పెట్టాలని మాచారెడ్డి ఎంఈవో దేవేందర్‌రావ్ సూచించారు. శుక్రవారం విద్యావనరుల కేంద్రంలో కాంప్లెక్స్ ఉపాధ్యాయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థుల నైపుణ్యాలను పెంచే విధంగా బోధన చేయాలని సూచించారు. మాచారెడ్డి కాంప్లెక్స్ ఇన్‌చార్జి హెచ్‌ఎం శ్రీనివాస్, కాంప్లెక్స్ సెక్రెటరీలు అశోక్, మాన్‌సింగ్, రిసోర్స్ పర్సన్‌లు ఏసురత్నం, శ్రీనివాస్, శ్రీనివాస్‌రావ్, సంతోష్, సీఆర్పీలు సంజీవ్, నరేశ్‌లు ఉన్నారు.

అదనపు బస్సులు కేటాయించండి



రాజంపేటలో ధర్నా చేస్తున్న విద్యార్థులు

రాజంపేట: రాజంపేట నుంచి కామారెడ్డి జిల్లా కేంద్రానికి అదనపు బస్సులను వేయాలని కోరుతూ శుక్రవారం కళాశాల విద్యార్థులు ధర్నా చేపట్టారు. నిత్యం సకాలంలో బస్సులు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. రాజంపేటకు ఉదయం, సాయంత్రం వేళల్లో విద్యార్థుల కోసం అదనపు బస్సులు వేయాలని డిమాండ్ చేశారు. పోలీసు సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని విద్యార్థులకు సర్దిచెప్పడంతో ఆందోళన విరమించారు.

వాటర్ ప్లాంట్ ఏర్పాటు



నస్రుల్లాబాద్: దుర్కి గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో మినరల్ వాటర్ ప్లాంట్‌ను శుక్రవారం అధ్యక్షులు దివిటి శ్రీనివాస్ యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంఘాన్ని ఆర్థికంగా అభివృద్ధి చేయడానికి వ్యాపారం ప్రారంభించామన్నారు. గ్రామ ప్రజలకు స్వచ్ఛమైన నీటిని అందించాలన్న ఉద్దేశంతో నీటి సౌకర్యం కల్పించామన్నారు. ఏఎంసీ చైర్మన్ దుర్గం శ్యామల, మాజీ జెడ్పీటీసీ దివిటి కిషోర్ యాదవ్, మాజీ ఎంపీటీసీ కుమ్మరి నారాయణ, మాజీ సర్పంచ్ నారాగౌడ్, సీఈవో సుధాకర్ తదితరులున్నారు.

సమాచారం..

అతిథి అధ్యాపకులకు దరఖాస్తుల ఆహ్వానం

మద్నూర్(జుక్కల్): మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న అతిథి అధ్యాపక పోస్టుల భర్తీ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ అశోక్ శుక్రవారం తెలిపారు. తెలుగు, ఆంగ్లం, కామర్స్, బోటనీ, జువాలజీ, కెమిస్ట్రీ, మ్యాథ్స్, ఫిజిక్స్ పోస్టులకు అర్హులైన అభ్యర్థులు ఈ నెల 28లోపు బిచ్కుంద డిగ్రీ కళాశాలలో స్వయంగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. పీజీలో కనీసం 55 శాతం ఉండి నెట్, సెట్, పీహెచ్‌డీ ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. 29న ఉదయం 10 గంటలకు కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇంటర్వ్యూ ఉంటుందని పేర్కొన్నారు.

స్పాట్ అడ్మిషన్‌ల కోసం..

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని మర్కల్ స్టేజీ వద్ద గల మహిళల గురుకుల డిగ్రీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్‌ల కోసం అర్హులైన ఎస్సీ కేటగిరీ విద్యార్థినుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శోభారాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ పూర్తి చేసుకున్న వారు నేరుగా కళాశాలకు వచ్చి అడ్మిషన్ పొందాలన్నారు. ఈ ప్రత్యేక విడత దోస్త్ రిజిస్ట్రేషన్ 25 నుంచి 31 వరకు కొనసాగనున్నట్లు తెలిపారు.

ఉర్దూ మీడియం డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లకు చివరి అవకాశం

బాన్సువాడ రూరల్: మండలంలోని శ్రీరాం నారాయణ ఖేడియా ప్రభుత్వ డిగ్రీకళాశాలలో ఉర్దూ మీడియం విభాగంలో చేరడానికి ఈనెల 31లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ డాక్టర్ ఇందూరు గంగాధర్ తెలిపారు. ఇంటర్మీడియట్ పూర్తిచేసిన అభ్యర్థులు సమీపంలోని ఆన్‌లైన్ సెంటర్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

భక్తుల గోత్రనామాలతో అమ్మవారికి అర్చనలు

కామారెడ్డి అర్బన్: స్థానిక హౌసింగ్‌బోర్డు కాలనీలోని శారదామాత ఆలయంలో శ్రావణ మాసం సందర్భంగా వచ్చే నెల 23 వరకు అమ్మవారికి నిత్యం భక్తుల గోత్రనామాలతో అర్చన, విశేష పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ ప్రతినిధులు, అర్చకులు సతీష్‌పాండే తెలిపారు. వివరాలకు 70364 74363, 98495 14922.

సంక్షిప్తం

కాంగ్రెస్‌లో చేరిక



నిజాంసాగర్(జుక్కల్): జుక్కల్ మండలం శక్తినగర్, డోన్‌గావ్ గ్రామాలకు చెందిన పలువురు బీఆర్‌ఎస్ కార్యకర్తలు శుక్రవారం కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు పార్టీ మండల అధ్యక్షుడు రమేష్ దేశాయ్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు ఆయన చెప్పారు.

గురుకుల బాలికల పాఠశాలలో కౌన్సిల్ ఎన్నికలు

నస్రుల్లాబాద్: దుర్కి గిరిజన గురుకుల బాలికల పాఠశాలలో శుక్రవారం స్టూడెంట్ కౌన్సిల్ ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ శ్యామలా దేవి మాట్లాడుతూ.. విద్యార్థులలో నాయకత్వ లక్షణాలను పెంపొందించడానికి ఎన్నికలను నిర్వహించామన్నారు. దీనిలో భాగంగా వివిధ విభాగాలకు విద్యార్థులను నియమిస్తూ బాధ్యులను చేస్తామన్నారు. వారి ఆధ్వర్యంలోనే పాఠశాలను నిర్వహిస్తామన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో కంటి వైద్య శిబిరం

పిట్లం(జుక్కల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో శుక్రవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించినట్లు ఆప్తాల్మిక్ ఆఫీసర్ హరికిషన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ శిబిరంలో కంటి సమస్యలతో బాధపడుతున్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశామన్నారు. తీవ్ర దృష్టి సమస్యలు ఉన్నవారికి అద్దాలు వాడాలని, పౌష్టికాహారం తీసుకోవాలని, మోతి బిందు సమస్యలున్న వారు శస్త్ర చికిత్స చేసుకోవాలని సూచించినట్లు తెలిపారు.

దేమికలాన్‌లో కొనసాగుతున్న వైద్యశిబిరం

తాడ్వాయి(ఎల్లారెడ్డి): దేమికలాన్‌లో శుక్రవారం వైద్యశిబిరం కొనసాగింది. గ్రామంలో పలువురు వాంతులు, విరేచనాలతో బాధపడుతున్న విషయం తెలిసిందే. దీంతో డీఎంహెచ్‌వో ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి పలువురికి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో చంద్రశేఖర్ మాట్లాడుతూ.. ప్రస్తుతం గ్రామంలో ఎవరికి ఎలాంటి ఇబ్బందులు లేవన్నారు. కామారెడ్డి ఆస్పత్రిలో చికిత్సలు పొందుతున్నవారు కూడా క్షేమంగా ఉన్నారని, వారిని డిశ్చార్జి చేసినట్లు తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తమ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు.

దివ్యాంగ విద్యార్థులకు ఫిజియోథెరపి

పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో శుక్రవారం దివ్యాంగ విద్యార్థులకు ఫిజియోథెరపి క్యాంపు నిర్వహించారు. ఐఈఆర్‌పీ కమల్ కిషోర్ మాట్లాడారు. వైద్యురాలు సారిక, మండల విద్యాధికారి దేవిసింగ్, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.